క్లుప్తంగా

గొర్రెల కాపరులకు దాణా పంపిణీ



పాన్‌గల్: ప్రభుత్వం నుంచి సబ్సిడీ గొర్రెలను పొందిన కాపారులకు బుధవారం మండల కేంద్రంలోని పశువైద్యశాలలో మండల పశువైద్యాధికారి డా.శ్యామ్ దాణాను పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ 35 మంది గొర్రెల కాపారులకు ఒక్కొక్కరికి 100 కేజీల చొప్పున దాణాను పంపిణీ చేశామన్నారు. కాపారులు దాణాను జీవాలకు ప్రతి రోజు తినిపించాలని సూచించారు

చిన్నారులకు పండ్లు..



పెబ్బేరు రూరల్: రాష్ట్ర వ్యవసాయశాఖ మంత్రి పుట్టిన రోజు సందర్భంగా బుధవారం వనపర్తి మండలంలోని అంకూర్ ప్రాథమికోన్నత పాఠశాలలో బీఆర్ఎస్ నాయకుడు నరేందర్‌రెడ్డి విద్యార్థులకు స్వీట్లు, పండ్లు పంపిణీ చేశారు.

పెబ్బేరులో..

మండల కేంద్రంలోని ప్రాథమిక ఆరోగ్య కేంద్రంలోని గర్భిణులు, రోగులకు బీఆర్ఎస్ నాయకుడు రణధీర్‌రెడ్డి పండ్లు, బ్రెడ్ ప్యాకెట్లు పంపిణీ చేశారు. కార్యక్రమంలో ఎండీ గౌస్, వెంకటేష్‌చారి, బబ్లుఅలియా, శ్రీనివాస్, వసంత్, నిప్పి, ఉదయ్, వాన్యాస్, జ్ఞాని, రాకేష్‌రెడ్డి, భాస్కర్, వినోద్ తదితరులు పాల్గొన్నారు.

నేడు తహసీల్దార్ కార్యాలయం ప్రారంభం

ఎర్రవల్లిచౌరస్తా: ఇటీవల నూతన మండలంగా ఏర్పడిన ఎర్రవల్లిలో గురువారం తహసీల్దార్ కార్యాలయాన్ని ప్రారంభించనున్నట్లు ఇటిక్యాల తహసీల్దార్ వెంకటేశ్వర్లు బుధవారం తెలిపారు. ప్రారంభోత్సవానికి వ్యవసాయశాఖ మంత్రి నిరంజన్‌రెడ్డి, శాసనమండలి ఎమ్మెల్సీ చల్లా వెంకట్రామిరెడ్డి, ఎమ్మెల్యే అబ్రహంలు హాజరవుతారని పేర్కొన్నారు. ఎర్రవల్లి మండలంలో ఇన్‌చార్జ్ తహసీల్దార్‌గా నందిని (డీటీ), ఆర్ఐగా సుదర్శన్‌రెడ్డి, జూనియర్ అసిస్టెంట్‌గా శోభ, సీనియర్ అసిస్టెంట్‌గా తిరుమలేష్ (డిప్యుటేషన్), కార్యాలయ సబార్డినేటర్‌గా అంజనమ్మను కేటాయించారు.

వనపర్తిని విద్యాపర్తిగా మార్చిన మంత్రి



వనపర్తి టౌన్: పట్టణాన్ని విద్యకు కేంద్రంగా మార్చి మెడికల్, ఇంజినీర్, వ్యవసాయ, మత్స్యకార కళాశాలలు మంజూరు చేయించి వనపర్తిని మంత్రి నిరంజన్‌రెడ్డి విద్యాపర్తిగా మార్చారని మున్సిపల్ వైస్ చైర్మన్ వాకిటి శ్రీధర్ అన్నారు. ఈ మేరకు పట్టణ కేంద్రంలోని ప్రభుత్వ బాలుర డిగ్రీ కళాశాలలో బుధవారం ఏర్పాటు చేసిన ఫ్రెషర్స్ పార్టీకి ముఖ్య అతిథిగా హాజరయ్యారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. వనపర్తిలో విద్యకు పెద్దపీట వేస్తూ విద్యార్థుల బంగారు భవిష్యత్‌కు పాటుపడుతున్నారని చెప్పారు. అంతకు ముందు శ్రీధర్‌ను కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ శ్రీనివాస్ శాలువాతో ఘనంగా సన్మానించారు. కార్యక్రమంలో స్టార్ రహీం పాల్గొన్నారు.

మక్తల్‌కు తరలిన బీఆర్ఎస్ నాయకులు



ఆత్మకూర్: అభివృద్ధి కార్యక్రమాల ప్రారంభోత్సవాల్లో భాగంగా రాష్ట్ర ఆర్థిక, ఆరోగ్యశాఖ మంత్రి హరీశ్‌రావు హాజరైన మక్తల్‌లో జరిగిన బహిరంగసభకు ఆత్మకూర్ మండలం నుంచి బీఆర్ఎస్ మండల అధ్యక్షుడు రవికుమార్‌యాదవ్ ఆధ్వర్యంలో బీఆర్ఎస్ శ్రేణులు భారీగా తరలివెల్లారు. వందకు పైగా ప్రత్యేక వాహనాల్లో మున్సిపాలిటీతో పాటు, గ్రామాల నుంచి కార్యకర్తలు తరలివెళ్లారు. కార్యక్రమంలో ఎంపీపీ బంగారు శ్రీనివాసులు, మాజీ ఎంపీపీ శ్రీధర్‌గౌడ్, జెడ్పీటీసీ శివరంజని, వైస్‌ఎంపీపీ కోటేష్, విండో అధ్యక్షుడు కృష్ణమూర్తి, లక్ష్మీకాంత్‌రెడ్డి, పుర చైర్‌పర్సన్ గాయత్రి, వైస్ చైర్మన్ విజయభాస్కర్‌రెడ్డి, మార్కెట్ కమిటీ చైర్మన్ ఎస్ఏ రాజు, వైస్‌చైర్మన్ వేణుగోపాల్‌రెడ్డి తదితరులు ఉన్నారు.

మహాధర్నా వాల్‌పోస్టర్ విడుదల

చిన్నచింతకుంట: చిత్తనూర్ ఇథనాల్ కంపెనీ రద్దు చేయాలని డిమాండ్ చేస్తూ ఈనెల 8న ఎక్లాస్‌పూర్ స్టేజ్ వద్ద ధర్నా నిర్వహించనున్నారు. ఈ మేరకు వాల్ పోస్టర్‌ను బుధవారం మండల కేంద్రంలో కంపెనీ వ్యతిరేక పోరాట కమిటీ ఆధ్వర్యంలో విడుదల చేశారు. టీఎఫ్‌టీయూ జిల్లా కార్యదర్శి యాదగిరి మాట్లాడారు. జస్టిస్ బి.చంద్రకుమార్ తదితరులు ముఖ్యఅతిథులుగా వస్తారని వివరించారు. లక్ష్మయ్య, రాంచంద్రయ్య, మల్లేష్, మధు ఉన్నారు.

టీకా ఒక్కటే.. ప్రయోజనాలెన్నో

- ఐదేళ్లలోపు పిల్లలకు ఇంద్రధనుస్సు
- సద్వినియోగం చేసుకోవాలంటున్న వైద్యసిబ్బంది



కేతేపల్లిలో చిన్నారులకు టీకాలు వేయిస్తున్న వైద్య సిబ్బంది (ఫైల్)

పాన్‌గల్: ఐదేళ్ల లోపు చిన్నారులకు సకాలంలో వ్యాధి నిరోధక టీకాలు వేయించ లేని సమయంలో దాదాపు 20 రకాల వ్యాధుల నివారణకు ఉపకరించే 'ఇంద్రధనస్సు' టీకాను వేయించాలని వైద్యులు సూచిస్తున్నారు. ఇందుకోసం వైద్యారోగ్య శాఖ మిషన్ టీకా ఒక్కటే. ప్రయోజనాలెన్నో అనే పేరుతో ప్రత్యేక కార్యక్రమాన్ని నిర్వహిస్తోంది. డిప్తీరియా, కోరింత దగ్గు, ధనుర్వాతం, పోలియో, క్షయ, తట్టు, హెపటైటిస్‌బీ ఇలా 20 రకాల వ్యాధులు రాకుండా ఈ టీకా పనిచేస్తుందని వైద్య సిబ్బంది పేర్కొంటున్నారు.

ప్రత్యేక సర్వే

వలస కుటుంబాల పిల్లలకు తల్లిదండ్రులు నిర్ణీత సమయంలో టీకాలు వేయించలేకపోతున్నారు. ఇతర రాష్ట్రాల నుంచి ఇక్కడికి వచ్చి ఇటుక బట్టీల్లో పనిచేసే కార్మికుల పిల్లల పరిస్థితి అలాగే ఉంటుంది. దీని కోసం వైద్య సిబ్బంది ప్రత్యేక సర్వే ద్వారా నిర్ణీత సమయంలో టీకాలు వేసుకోలేని చిన్నారులను గుర్తించి మిషన్ ఇంద్రధనుస్సు కింద ఆగస్టులో 7 నుంచి 12, సెప్టెంబర్‌లో 11 నుంచి 16వ తేదీ వరకు, అక్టోబర్‌లో 9 నుంచి 14వ తేదీ వరకు మూడు విడతలుగా టీకాలు వేస్తారు.

మండలంలో చిన్నారుల వివరాలు

మండలంలోని 28 గ్రామ పంచాయతీ పరిధిలో ఐదేళ్ల లోపు చిన్నారులు 4,246 మంది ఉన్నట్లు వైద్య ఆరోగ్యశాఖ అధికారులు తెలిపారు. వీరిలో టీకాలు వేయించుకొని చిన్నారులను గుర్తించి చివరి విడతలో టీకాలు వేసేందుకు అధికారులు కసరత్తు చేస్తున్నారు. ఇంద్రధనస్సు కార్యక్రమంలో నిర్వహించే మూడు విడతల్లో ఇప్పటికే రెండు విడతలు పూర్తి కావచ్చాయి. రెండు విడతల్లో వేయించుకొని వారు అక్టోబర్ 9వ తేదీ నుంచి 14వ తేదీ వరకు ప్రత్యేక టీకా కార్యక్రమాన్ని సద్వినియోగం చేసుకోవాలన్నారు.

ఉపాధి పనుల నిర్వహణపై గ్రామసభలు



బండపల్లిలో పంచాయతీ కార్యదర్శిని నిలదీస్తున్న గ్రామస్తులు

పాన్‌గల్: మండలంలోని వెంగళాయిపల్లి, బండపల్లి గ్రామాల్లో నిర్వహించిన ఉపాధి పనులపై బుధవారం సామాజిక తనిఖీ సిబ్బంది ఆధ్వర్యంలో గ్రామసభ నిర్వహించారు. ఈ సందర్భంగా ఎంపీడీఓ నాగేశ్వర్‌రెడ్డి మాట్లాడుతూ 13వ విడత సామాజిక తనిఖీలో భాగంగా 2022 జనవరి నుంచి 2023 మార్చి వరకు గ్రామంలో చేపట్టిన ఉపాధి పనులపై ఖర్చు, నిధులపై ఆడిట్ నిర్వహించి దానికి అనుగుణంగా గ్రామసభ నిర్వహించామన్నారు.

కార్యదర్శిని నిలదీసిన గ్రామస్తులు

మండలంలోని బండపల్లిలో నిర్వహించిన గ్రామసభలో పంచాయతీ కార్యదర్శి నాగమణిని గ్రామస్తులు నిలదీశారు. కొందరు కూలీలు పనులు చేసినా డబ్బులు జమ కాలేదని, మరికొందరు పనులకు రాకున్నా వారికి డబ్బులు వచ్చాయని, రైతు పొలాల్లో ఉపాధి పథకంపై లేవలింగ్‌కు దరఖాస్తు చేసుకున్న పనులు కల్పించే విషయంలో జాప్యం, గ్రామసభల నిర్వహణపై సమాచారం ఇవ్వకపోవడం వంటి అంశాలపై కార్యదర్శిని గ్రామస్తులు, రైతులు ప్రశ్నించారు. ఆయా అంశాలపై మండల స్థాయిలో నిర్వహించే ప్రజావేదికలో అధికారులకు ఫిర్యాదు చేయనున్నట్లు ఎంపీటీసీ సభ్యుడు ప్రేమ్ కుమార్, రైతులు పేర్కొన్నారు.

నేడు ప్రజా వేదిక

స్థానిక ఎంపీడీఓ కార్యాలయం ఆవరణలో జాతీయ గ్రామీణ ఉపాధి హామీ పథకం 13వ విడత సామాజిక తనిఖీపై గురువారం ప్రజావేదిక నిర్వహిస్తున్నట్లు ఎంపీడీఓ నాగేశ్వర్‌రెడ్డి బుధవారం ఒక ప్రకటనలో పేర్కొన్నారు. మండలంలోని 28 గ్రామ పంచాయతీల పరిధిలో జనవరి 1, 2022 నుంచి మార్చి 31, 2023 వరకు జరిగిన రూ. 6 కోట్ల ఖర్చుపై ప్రజా వేదికలో గ్రామాల వారీగా చర్చించనున్నట్లు ఆయన పేర్కొన్నారు.

ముతిరెడ్డిపల్లిని కోడేరులోనే కొనసాగించాలి

పెద్దకొత్తపల్లి: ముతిరెడ్డిపల్లి గ్రామాన్ని కొత్తగా ఏర్పాటు చేసిన ఏదుల మండలంలో కాకుండా కోడేరు మండలంలోనే కొనసాగించాలని కోరుతూ బుధవారం మండల కేంద్రంలో గ్రామస్తులు రోడ్డుపై ధర్నా నిర్వహించారు. దీంతో కొల్లాపూర్, హైదరాబాద్, వనపర్తి, అచ్చంపేట వెళ్లే వాహనదారులకు ఇబ్బందులు ఏర్పడ్డాయి. ఈ సందర్భగా సర్పంచ్ నారమ్మ మాట్లాడుతూ కొల్లాపూర్ ఎమ్మెల్యే బీరం హర్షవర్ధన్‌రెడ్డి, మంత్రి సింగిరెడ్డి నిరంజన్‌రెడ్డిలు ముతిరెడ్డిపల్లి ప్రజలకు తీవ్ర అన్యాయం చేశారని ఆరోపించారు. ఘటన స్థలానికి కొల్లాపూర్ సీఐ యాలాద్రి చేరుకొని ఆందోళనకారులను శాంతింపజేశారు. కార్యక్రమంలో బీజేపీ జిల్లా అధ్యక్షుడు ఎల్లేని సుధాకరావు, మండల అధ్యక్షుడు బీమేశ్వర్‌రెడ్డి పాల్గొన్నారు.

పేదల సంక్షేమమే ధ్యేయం

కొల్లాపూర్: పేదల సంక్షేమమే ప్రభుత్వ ధ్యేయమని ఎమ్మెల్యే హర్షవర్ధన్‌రెడ్డి అన్నారు. బుధవారం పట్టణంలోని ప్రభుత్వ బాలికల ఉన్నత పాఠశాల ఆవరణ, ఎంపీడీఓ కార్యాలయ ఆవరణలో ఎమ్మెల్యే మహిళలకు బతుకమ్మ చీరలు పంపిణీ చేశారు. గ్రామ పంచాయతీలకు, యువకులకు క్రీడాసామగ్రిని అందజేశారు. ఆర్డీఓ నాగరాజు, ఎంపీడీఓ చెన్నమ్మ, తహసీల్దార్ శ్రీకాంత్, మున్సిపల్ చైర్‌పర్సన్ విజయలక్ష్మి, ఎంపీపీ బోజ్యానాయక్, గొర్రెల కాపరుల సంఘ జిల్లా అధ్యక్షుడు గాలియాదవ్, నాయకులు ఉన్నారు.

బిజినేపల్లి: తిమ్మాపేటలో బతుకమ్మ చీరలు, స్పోర్ట్స్ కిట్లను ఎంపీడీవో కరుణశ్రీ పంపిణీ చేశారు. కార్యక్రమంలో ఉప సర్పంచ్ ఇబ్రహీం, మార్కెట్ కమిటీ డైరెక్టర్ కవిత, వార్డు సభ్యులు పాల్గొన్నారు.

కోడేరు: మండలంలోని పస్పులలో సర్పంచ్ విష్ణువర్ధన్‌రెడ్డి, బీఆర్ఎస్ రాష్ట్ర నాయకుడు రఘువర్ధన్‌రెడ్డి బుధవారం బతుకమ్మ చీరలను పంపిణీ చేశారు. కార్యక్రమంలో వార్డు సభ్యులు పాల్గొన్నారు.

బాధిత కుటుంబాలకు పరామర్శ



మృతదేహానికి నివాళులర్పిస్తున్న విజయమ్మ



శ్రీరంగాపురంలో..

చిన్నంబావి: మండలంలోని పెద్దదగడకు చెందిన వడ్ల శ్రీనివాస్‌చారి ఇటీవల అనారోగ్యానికి గురై బుధవారం మృతి చెందాడు. విషయం తెలుసుకున్న ఎమ్మెల్యే బీరం హర్షవర్ధన్‌రెడ్డి సతీమణి బీరం విజయమ్మ, బీఆర్ఎస్ రాష్ట్ర నాయకుడు రంగినేని అభిలాష్‌రావు బాధిత కుటుంబ సభ్యులను పరామర్శించారు. మృతదేహానికి పూలమాల వేసి నివాళులర్పించారు. అనంతరం ఆర్థికసాయం అందించారు. అదేవిధంగా అదే గ్రామానికి చెందిన చనమోని గంగయ్య కుటుంబ సభ్యులను పరామర్శించారు. మండలంలోని వెల్టూరుకు చెందిన బెక్కెం ప్రతాప్‌రెడ్డి మరణించడంతో ఆయన భౌతిక కాయానికి పూలమాల వేసి నివాళులర్పించారు. కార్యక్రమంలో జెడ్పీటీసీ వెంకట్రమణమ్మ, ఇంద్రసేనారెడ్డి, ఈశ్వర్‌రెడ్డి, మహిచంద్ర, రమేష్, యుగంధర్‌గౌడ్, సర్పంచ్ మధు, పురేందర్ రెడ్డి, నవీన్‌రెడ్డి, శంకర్‌రెడ్డి, శరత్‌కుమార్ పాల్గొన్నారు.

పెబ్బేరు రూరల్: శ్రీరంగాపురం మండల కేంద్రంలోని ఎరుకలి బాలస్వామి, మేకల సింగోటం అనారోగ్యంతో బుధవారం మృతి చెందారు. విషయం తెలుసుకున్న మండల కాంగ్రెస్ నాయకుడు మేఘారెడ్డి దృష్టికి తీసుకెళ్లారు. స్పందించిన ఆయన రూ.10 వేలు పంపించారు. మండల నాయకులు గ్రామంలో బాధిత కుటుంబాలను పరామర్శించి, రూ.5 వేల చొప్పున ఆర్థికసాయం అందజేశారు. కార్యక్రమంలో శ్రీహరిరాజు, అశన్న, నవీద్, అంజి, అశోక్, భాను, నవీన్, రఘు, నరేష్ తదితరులు పాల్గొన్నారు.

మధ్యాహ్న భోజన కార్మికులను ఆదుకోవాలి



ఆత్మకూర్: మధ్యాహ్న భోజన కార్మికుల పెండింగ్ బిల్లులు వెంటనే విడుదల చేసి ఆదుకోవాలని ఇఫ్టూ కార్మిక సంఘం రాష్ట్ర కార్యదర్శి ప్రసాద్ కోరారు. బుధవారం మండల కేంద్రంలోని ఎంఈఓ కార్యాలయం ఎదుట అమరచింత, ఆత్మకూర్ మండలాల మధ్యాహ్న భోజన కార్మికులు నిరసన తెలుపగా ఆయన పాల్గొని వారికి మద్దతు తెలిపి అనంతరం ఎంఈఓ భాస్కర్‌సింగ్‌కు వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. నాలుగు నెలలుగా బిల్లులు చెల్లించకపోవడంతో కార్మికులు ఆర్థిక ఇబ్బందులు ఎదుర్కొంటున్నారని ఆందోళన వ్యక్తం చేశారు. పెంచిన వేతనాలు చెల్లించడంతో పాటు పెండింగ్ వేతనాలు, బిల్లులు విడుదల చేయాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో సంఘం నాయకులు గోవిందమ్మ, దేవమ్మ, భారతమ్మ, సుజాత, రాజమ్మ, హేమలత, బాలేశ్వరమ్మ, నిర్మలమ్మ, మణెమ్మ పాల్గొన్నారు.

తెలంగాణ పథకాలు దేశానికే ఆదర్శం



మదనాపురంలో డబుల్‌బెడ్‌రూం ఇళ్లను ప్రారంభిస్తున్న మంత్రి హరీశ్‌రావు

కొత్తకోట రూరల్: రాష్ట్రంలో చేపడుతున్న సంక్షేమ, అభివృద్ధి పథకాలు దేశానికే ఆదర్శంగా నిలుస్తున్నాయని దేవరకద్ర ఎమ్మెల్యే ఆల వెంకటేశ్వర్‌రెడ్డి అన్నారు. బుధవారం మంత్రి హరీశ్‌రావు, ఎమ్మెల్యే ఆల వెంకటేశ్వర్‌రెడ్డితో కలిసి కొత్తకోటలో నిర్మించనున్న 30పడకల సీహెచ్‌సీ, దేవరకద్రలో నిర్మించనున్న 100పడకల సీహెచ్‌సీకి శంకుస్థాపన చేయడంతో పాటు కొత్తకోట మున్సిపాలిటీలో రూ.12కోట్లతో వివిధ అభివృద్ధి పనులకు శంకుస్థాపన చేశారు. ఈ సందర్భంగా కొత్తకోటలో ఏర్పాటు చేసిన బహిరంగ సభలో ఎమ్మెల్యే ఆల వెంకటేశ్వర్‌రెడ్డి మాట్లాడుతూ నియోజకవర్గంలో కేసీఆర్ నాయకత్వంలో కొత్తగా మూడు మండలాలను ఏర్పాటు చేసుకోవడంతో పాటు ఎన్నో అభివృద్ధి పనులకు శ్రీకారం చుట్టామన్నారు. గతంలో నియోజకవర్గంలో 36వేల ఎకరాలకు సాగునీరు అందేదని, ప్రస్తుతం 98వేల ఎకరాల సాగవుతుందని తెలిపారు. పాలమూరు-రంగారెడ్డి కెనాల్ పూర్తయితే మరో 60వేల ఎకరాలకు సాగునీరు అందుతుందన్నారు. కార్యక్రమంలో పార్లమెంట్ సభ్యుడు మన్నె శ్రీనివాస్‌రెడ్డి, ఎస్సీ, ఎస్టీ కమిషన్ చైర్మన్ ఎర్రోళ్ల శ్రీనివాసులు, గిడ్డంగుల కార్పొరేషన్ చైర్మన్ రజిని, జెడ్పీచైర్మన్లు లోక్‌నాథ్‌రెడ్డి, స్వర్ణమ్మ, జెడ్పీవైస్ చైర్మన్ వామన్‌గౌడ్, డీసీసీబీ డైరెక్టర్ వంశీధర్‌రెడ్డి, ఎంపీపీ గుంత మౌనిక, సీడీసీ చైర్మన్ చెన్నకేశవరెడ్డి, మున్సిపల్ చైర్‌పర్సన్ పి.సుఖేశిని తదితరులు పాల్గొన్నారు.

డబుల్ బెడ్‌రూం ఇళ్ల ప్రారంభం

మదనాపురం: మండల కేంద్రంలో రూ.8 కోట్ల వ్యయంతో నిర్మించిన 136 డబుల్ బెడ్‌రూం ఇళ్లను బుధవారం ఆర్థిక శాఖ మంత్రి హరీశ్‌రావు ప్రారంభించారు. ఈ సందర్భంగా హరీశ్‌రావు మాట్లాడుతూ ఇల్లు లేని నిరుపేదలకు ఇళ్లు నిర్మించి వారి కళ్లల్లో సంతోషం చూడడమే సీఎం కేసీఆర్ ఉద్దేశమన్నారు. కార్యక్రమంలో మంత్రి నిరంజన్‌రెడ్డి, ఎంపీ మన్నె శ్రీనివాస్‌రెడ్డి, ఎమ్మెల్యే ఆలవెంకటేశ్వరెడ్డి, ఎంపీపీ పద్మావతి, జెడ్పీటీసీ కృష్ణయ్యయాదవ్ తదితరులు పాల్గొన్నారు.

బీజేపీ గెలుపు ఖాయం

కోయిల్‌కొండ: మండల కేంద్రంలోని స్వామి వివేకనంద చౌరస్తాలో బీజేపీ సీనియర్ నాయకులు రతంగ్‌పాండురెడ్డి జన్మదిన వేడుకలను బుధవారం ఘనంగా నిర్వహించారు. ఈసందర్భంగా మండల అధ్యక్షుడు మధుసూదన్‌రెడ్డి మాట్లాడారు. రానున్న ఎన్నికల్లో కేంద్రంతో పాటు రాష్ట్రంలోనూ బీజేపీ గెలుపు ఖాయమన్నారు.

పారిశుద్ధ్యంపై ప్రత్యేక దృష్టి సారించాలి



మాట్లాడుతున్న ఎంపీడీఓ నాగేశ్వర్‌రెడ్డి

పాన్‌గల్: గ్రామ పంచాయతీల్లో పారిశుద్ధ్యంపై ప్రత్యేక దృష్టి సారించి స్వచ్ఛ గ్రామాలుగా మార్చడంలో ప్రజలను భాగస్వాములను చేయాలని ఎంపీడీఓ నాగేశ్వర్‌రెడ్డి అన్నారు. బుధవారం మండలంలోని తెల్లరాళ్లపల్లి పంచాయతీని సందర్శించి పలు రికార్డులను పరిశీలించారు. అనంతరం సర్పంచ్ రేణమ్మ, పంచాయతీ కార్యదర్శితో గ్రామాభివృద్ధి, నర్సరీల నిర్వహణ, ప్రకృతి వనాలు, హరితహారం, ఇంటి పన్నుల వసూలు తదితర అంశాలపై చర్చించారు. నర్సరీలు, ప్రకృతి వనం, హరితహారంలో నాటిన మొక్కలు ఎండకుండా క్రమం తప్పకుండా నీటిని పట్టాలని ఆదేశించారు. గ్రామంలో చేపడుతున్న అభివృద్ధి పనులు, చేసిన ఖర్చులకు సంబంధించిన రికార్డులను పకడ్బందీగా నమోదు చేయాలని సూచించారు. కార్యక్రమంలో ఎంపీఓ రఘురాములు పాల్గొన్నారు.

వర్గీకరణ సాధనే లక్ష్యంగా పాదయాత్ర



వాల్‌పోస్టర్లు విడుదల చేస్తున్న నాయకులు

వీపనగండ్ల: పార్లమెంట్‌లో ఎస్సీ వర్గీకరణ బిల్లుకు చట్టబద్ధత లభించే వరకు ఎన్నో ఉద్యమాలను నిర్వహించి ప్రజాప్రతినిధులపై ఒత్తిడి తీసుకొస్తామని ఎమ్మార్పీఎస్ జిల్లా కోకన్వీనర్ మీసాల నాగరాజు మాదిగ అన్నారు. ఈ నెల 7వ తేదీన మందకృష్ణ మాదిగ ఆధ్వర్యంలో అలంపూర్ నుంచి నిర్వహించ తలపెట్టిన విశ్వరూప మహాజన పాదయాత్ర వాల్‌పోస్టర్లను బుధవారం ఆయన విడుదల చేశారు. ఎస్సీ వర్గీకరణ పార్లమెంట్ శీతాకాల సమావేశంలో చట్టబద్ధత కల్పించేందుకు బీజేపీ ప్రభుత్వం ముందుకు రావాలని ఆయన డిమాండ్ చేశారు. ఈ విశ్వరూప మహాజన పాదయాత్రలో జిల్లాలోని మాదిగలు అధిక సంఖ్యలో పాల్గొని జయప్రదం చేయాలని ఆయన విజ్ఞప్తి చేశారు. కార్యక్రమంలో ఎంఎస్ఎఫ్ జిల్లా అధ్యక్షుడు పరశురాం, మండల కన్వీనర్ కురుమయ్య, నాయకులు నాగరాజు, విష్ణు, రాజు, రాముడు, అభిషేక్, నర్సింహ తదితరులు పాల్గొన్నారు.

అక్రమ అరెస్టులతో ఉద్యమాలను ఆపలేరు



ఆందోళన చేస్తున్న కాంగ్రెస్ నాయకులు

కొత్తకోట రూరల్: అక్రమ అరెస్టులతో ఉద్యమాలను ఆపలేరని కాంగ్రెస్ పార్టీ నాయకులు ప్రశాంత్, బోయేజ్, కృష్ణారెడ్డి, మేస్త్రీ శ్రీనివాసులు అన్నారు. కొత్తకోటకు ఎమ్మెల్యే ఆల వెంకటేశ్వర్‌రెడ్డి ఇచ్చిన హామీలను విస్మరించారని నిరసన వ్యక్తం చేస్తూ కాంగ్రెస్ పార్టీ ఆధ్వర్యంలో బుధవారం కొత్తకోట చౌరస్తాలో ఆందోళనకు దిగారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ మండలానికి మంత్రి హరీష్‌రావు, ఎమ్మెల్యే ఆల వెంకటేశ్వర్‌రెడ్డి ఏమి ఇచ్చారని ప్రశ్నించారు. ఇచ్చిన వాగ్దానాలను అమలు చేయకుండా బహిరంగ సభ పెట్టి ప్రజలను మరోసారి మోసం చేసేందుకు వస్తున్నారని దుయ్యబట్టారు. పట్టణంలో ప్రభుత్వ డిగ్రీ కళాశాల, ఉర్దూ మీడియం జూనియర్ కళాశాల, డబుల్‌బెడ్రూం ఇళ్ల నిర్మాణం, ఆర్డీఓ ఆఫీస్ ఏర్పాటు చేస్తామని, బీడీ కార్మికులకు ఇళ్లు నిర్మించి ఇస్తామని చెప్పి మోసం చేశారని మండిపడ్డారు. ఇచ్చిన హామీలను విస్మరించిన బీఆర్ఎస్‌కు ప్రజలు బుద్ధి చెబుతారన్నారు. ఆందోళన చేస్తున్న కాంగ్రెస్ నాయకులను పోలీసులు అరెస్ట్ చేసి స్టేషన్‌కు తరలించారు. కార్యక్రమంలో గొల్లబాబు, ధన్వాడ బాలస్వామి, బీచుపల్లియాదవ్, రవీందర్‌రెడ్డి, రాములుయాదవ్, ముస్తఫా, లక్ష్మయ్య, వెంకటేష్, నాగేంద్రబాబు తదితరులు ఉన్నారు.

'ప్రాజెక్టులు కట్టింది కాంగ్రెస్సే'



మాట్లాడుతున్న తులసీరాజ్‌యాదవ్

ఆత్మకూర్: రాష్ట్రంలో, ఉమ్మడి మహబూబ్‌నగర్ జిల్లాల్లో సాగునీటి ప్రాజెక్టులను కట్టింది కాంగ్రెస్ పార్టీ, దివంగత ముఖ్యమంత్రి డాక్టర్ వైఎస్ రాజశేఖర్‌రెడ్డి అని మక్తల్ నియోజకవర్గ యూత్ కాంగ్రెస్ అధ్యక్షుడు తులసీరాజ్‌యాదవ్ అన్నారు. బుధవారం ఆయన మాట్లాడుతూ మక్తల్‌లో జరిగిన బీఆర్ఎస్ సభలో మంత్రి హరీశ్‌రావు ప్రాజెక్టులన్నీ కేసీఆర్ కట్టించారని చెప్పుకోవడం విడ్డూరంగా ఉందన్నారు. కాంగ్రెస్ పార్టీ అధికారంలో ఉన్నప్పుడు ఏమీ చేయలేదని అబద్దాలు చెప్పారని, సంగంబండ, భూతప్పూర్, కోయిల్‌సాగర్ ప్రాజెక్టులను కట్టి సాగునీటిని అందించిన మహానీయుడు వైఎస్ఆర్ అని గుర్తు చేశారు. ఎన్ని అబద్దాలు చెప్పినా రానున్న ఎన్నికల్లో కాంగ్రెస్ పార్టీకే అధికారం కట్టబెట్టేందుకు ప్రజలు సిద్ధంగా ఉన్నారన్నారు.

సంక్షేమ పథకాల అమలులో ముందున్నాం



గోవర్ధనగిరిలో హైమాస్ట్ లైట్లను ప్రారంభిస్తున్న ఎమ్మెల్యే బీరం హర్షవర్ధన్‌రెడ్డి

వీపనగండ్ల: సంక్షమ పథకాలను అమలు చేయడంలో రాష్ట్రం దేశంలోనే ముందు వరుసలో నిలుస్తుందని కొల్లాపూర్ బీరం హర్షవర్ధన్‌రెడ్డి అన్నారు. బుధవారం గోవర్ధనగిరిలో హైమాస్ట్ లైట్లను ప్రారంబించిన ఆయన వివిధ పార్టీలకు చెందిన పలువురు యువకులను బీఆర్ఎస్‌లోకి ఆహ్వానించారు. కొల్లాపూర్ నియోజకవర్గంలోని ప్రతి గ్రామం అభివృద్ధి పథంలోకి రావాలని ముఖ్యమంత్రిని ఒప్పించి అధిక నిధులను తీసుకొచ్చామన్నారు. నియోజకవర్గంలో దీర్ఘకాలికంగా పెండింగ్‌లో ఉన్న విద్య, వైద్యం, ఆరోగ్యం రంగాల్లో విప్లవాత్మకమైన మార్పులు తీసుకొచ్చామని, ప్రజలు మరోమారు తనను ఆశీర్వదిస్తే ప్రజలకు అండగా నిలుస్తానన్నారు. కార్యక్రమంలో సర్పంచ్ చంద్రకళ, ఎంపీటీసీ భాస్కర్‌రెడ్డి, సింగిల్‌విండో చైర్మన్ రామన్‌గౌడ్, అభిలాష్‌రావు, సురేష్‌రెడ్డి, ఎద్దుల సురేందర్‌రెడ్డి, సత్యానారాయణగౌడ్, మల్లయ్య యాదవ్, శేఖర్ తదితరులు పాల్గొన్నారు.

నిరుద్యోగులకు భరోసా



విద్యార్థిని సన్మానిస్తున్న నాగరాజ్‌గౌడ్

అమరచింత: నిరుద్యోగులను ఆదుకునేది కాంగ్రెస్ పార్టీయే అని, అధికారంలో వస్తే వారికి ఉద్యోగ అవకాశాలు కల్పిస్తామని టీపీసీసీ అధికార ప్రతినిధి కేశం నాగరాజ్‌గౌడ్ అన్నారు. పట్టణంలోని దేవరకొండ మోహన్, మమత దంపతుల కుమారుడు తరణ్ ఎంబీబీఎస్‌లో సీటు సాధించడంతో బుధవారం వారి ఇంటికి వెళ్లి శాలువ, పూలమాలతో సత్కరించారు. ఈసందర్భంగా మాట్లాడుతూ విద్య, ఉపాధి రంగాలకు అప్పట్లో కాంగ్రెస్ ప్రభుత్వం పెద్దపీట వేసిందన్నారు. బీఆర్ఎస్ ప్రభుత్వ హయాంలో ఉద్యోగాల నోటిఫికేషన్ రాక నిరుద్యోగులు ఆత్మహత్యలు చేసుకుంటున్న పరిస్థితులు దాపరించాయన్నారు. రాబోయే ఎన్నికలలో పార్టీ ఇచ్చిన ఆరు గ్యారెంటీ కార్డులను ప్రజలకు వివరిస్తూ పార్టీ విజయం కోసం కృషి చేస్తున్నామన్నారు. అమరుల త్యాగాల వల్ల ఏర్పడిన తెలంగాణలో వారి కుటుంబాలకు తీరని అన్యాయం జరిగిందని ఆందోళన వ్యక్తం చేశారు. కార్యక్రమంలో డీసీసీ ప్రధాన కార్యదర్శి ఆయూబ్‌ఖాన్, బ్లాక్ కాంగ్రెస్ అధ్యక్షుడు నర్సింహులు, మహేందర్‌రెడ్డి, పోసిరిగారి విష్ణు, తౌఫిక్, కేశవ్ యాదవ్, రామకృష్ణ, కావలి రవి తదితరులు పాల్గొన్నారు.

ఆశాలను రెండో ఏఎన్ఎంలుగా గుర్తించండి



గోపాల్‌పేటలో దీక్షకు మద్దతు తెలుపుతున్న కాంగ్రెస్ నాయకులు

అమరచింత: ఆశా వర్కర్లను రెండో ఏఎన్ఎంలుగా గుర్తించాలని వ్యవసాయ కార్మిక సంఘం జిల్లా ఉపాధ్యక్షుడు అజయ్, సీఐటీయూ జిల్లా సహాయ కార్యదర్శి ఆర్ఎస్ రమేష్ అన్నారు. బుధవారం తహసీల్దార్ కార్యాలయం ముందు ఆశాలు నిర్వహిస్తున్న రిలే దీక్షకు వారు మద్దతు తెలిపారు. ఈసందర్భంగా వారు మాట్లాడుతూ కరోన సమయంలో ప్రాణాలను పనంగా పెట్టి ప్రజలకు వైద్య సేవలు అందించిన ఆశాలకు అందాల్సిన వేతనాలతో పాటు పెంచిన వేతనాలను వెంటనే చెల్లించాలని, లేని పక్షంలో ఆందోళనలు ఉధృతం చేస్తామన్నారు. కార్యక్రమంలో శాంతమ్మ, సంధ్య, అరుణ, సుజాత, జయరాణి తదితరులు పాల్గొన్నారు.

పాన్‌గల్: తమ డిమాండ్లను పరిష్కరించాలని కోరుతూ ఆశా కార్యకర్తలు చేపట్టిన సమ్మె బుధవారానికి 10వ రోజుకు చేరుకుంది. ఈ సందర్భంగా సంఘం మండల నాయకురాలు రేణుక, సుజాత మాట్లాడుతూ న్యాయమైన డిమాండ్ల సాధన కోసం అనేక పద్ధతుల్లో పోరాటాలు నిరసనలు తెలిపిన ప్రభుత్వం స్పందించకపోవడంతోనే మళ్లీ సమ్మె చేయాల్సి వచ్చిందన్నారు. కార్యక్రమంలో మహేశ్వరీ, అలివేలు, యాదమ్మ, అరుణ, లక్ష్మి, కవిత, రామేశ్వరమ్మ తదితరులు పాల్గొన్నారు.

పెబ్బేరు రూరల్: వనపర్తి కలెక్టర్ కార్యాలయం సమీపంలో ధర్నా చౌక్‌లో సీఐటీయూ ఆధ్వర్యంలో ఆశా వర్కర్ల సమ్మె చేపట్టారు. కార్యక్రమంలో సీఐటీయూ జిల్లా కార్యదర్శి పుట్ట ఆంజనేయులు, ఆశాలు సునీత, బుచ్చమ్మ, బాలకిష్టమ్మ, భాగ్యమ్మ, శ్యామల తదితరులు పాల్గొన్నారు.

గోపాల్‌పేట: మండల కేంద్రంలో ఆశావర్కర్లు చేస్తున్న దీక్షకు బుధవారం కాంగ్రెస్ పార్టీ నాయకులు మద్దతు తెలిపారు. ఈ సందర్భంగా కాంగ్రెస్ పార్టీ జిల్లా అధ్యక్షుడు రాజేంద్రప్రసాద్ మాట్లాడుతూ వారి న్యాయమైన సమస్యలు నెరవేర్చాలని ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. అంతకుముందు ఆశావర్కర్లు బస్టాండులోని షాపులకు తిరుగుతూ బిక్షాటన చేస్తూ డబ్బులు సేకరించారు. కార్యక్రమంలో టౌన్ అధ్యక్షుడు శివన్న, కొంకి వెంకటేష్, ద్యారపోగు వెంకటేష్, నరహరి, తదితరులు పాల్గొన్నారు.

సాక్షి దినపత్రికలో ప్రకటనల కోసం మీ ప్రాంతంలో మా ప్రతినిధులు అందుబాటులో ఉన్నారు.

వివాహ, జన్మదిన, పదవీ విరమణ శుభాకాంక్షలు | వ్యాపార, ఉద్యోగ, బహిరంగ ప్రకటనలు | శ్రద్ధాంజలి, నిర్యాణము, వర్ధంతి మొదలగు

అన్ని రకాల ప్రకటనలు ఇవ్వదలిచిన వారు సంప్రదించండి.

99516 02829

మహబూబ్‌నగర్ జిల్లా: 90102 34478, 90105 22215, 97051 35557, 90108 69797, జడ్చర్ల: 97051 35557

నాగర్‌కర్నూల్ జిల్లా: 90100 06785

వనపర్తి జిల్లా: 95539 55603

జోగులాంబ గద్వాల జిల్లా: 95539 55603

నారాయణపేట జిల్లా: 90109 62007

Office mail : advtmbnr@gmail.com